క్లుప్తంగా

ఏటిపట్టు గ్రామాల ప్రజలకు న్యాయం చేయాలి



ప్రచార యాత్రలో ప్రసంగిస్తున్న సూరిబాబు

పెద్దాపురం: మండలంలోని ఏటిపట్టు గ్రామాల ప్రజలకు న్యాయం చేయాలని సీపీఎం నాయకులు నీలపాల సూరిబాబు, కేదారి నాగులు డిమాండ్ చేశారు. మండలంలోని జి.రాగంపేట, వడ్లమూరు, గోరింట, పులిమేరు, దివిలి, తిరుపతి, చదలాడ, మర్లావ, కాండ్రకోట, సిరివాడ, గుడివాడ గ్రామాల మీదుగా పెద్దాపురం వరకు శుక్రవారం సీపీఎం ప్రజా రక్షణ భేరీ యాత్ర నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఏటిపట్టు గ్రామాల ప్రజలకు ఇళ్ల స్థలాల మంజూరులో అన్యాయం జరిగిందన్నారు. సిరిపురపు శ్రీనివాస్, డి.క్రాంతికుమార్, సత్యనారాయణ, కృష్ణ పాల్గొన్నారు.

ధన్వంతరి జయంతి



ధన్వంతరి పూజలు నిర్వహిస్తున్న నాయీ బ్రాహ్మణులు

పెద్దాపురం: పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ధన్వంతరి జయంతి ఘనంగా నిర్వహించారు. నాయీ బ్రాహ్మణ కాలనీలోని రామాలయం వద్ద సంఘ నాయకులు కొమ్మన అమ్మన్న, తమిరి శ్రీను, రాకుర్తి పుల్లయ్యల ఆధ్వర్యంలో ధన్వంతరి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయీ బ్రాహ్మణుల ఆరాధ్యదైవం ధన్వంతరి స్వామికి కాలనీవాసులు పూజలు నిర్వహించారు.

కర్ర పెండలం సాగులో మెళకువలు



పట్టణ పరిధిలో దుంప తోటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త జానకి, హెచ్ఓ సుజాత

పెద్దాపురం: కర్ర పెండలం దుంప సాగులో రైతులు మెళకువలు పాటించాలని ఉద్యాన పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ జానకి అన్నారు. పట్టణంలో సాగవుతున్న దుంప పంటలను శుక్రవారం ఉద్యాన శాఖాధికారి సుజాతతో కలిసి పరిశీలించారు. శాస్త్రవేత్త జానకి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల కారణంగా నీటితడులు ఇచ్చే సదుపాయం లేని దుంప తోటలకు 10 గ్రాముల యూరియా లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పొడి వాతావరణం వల్ల ఎర్రనల్లి తాకిడి ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. నివారణకు గాను ప్రొపోనోఫాస్ రెండు మిల్లీ లీటర్లు లేదా డైకోఫాల్ ఐదు మిల్లీ లీటర్లు లీటరు నీటిలో కలిపి ఎకరానికి 200 లీటర్ల ద్రవణాన్ని పిచికారీ చేయాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభం



వడ్లమూరులో ధాన్యం కొనుగోలును ప్రారంభిస్తున్న వీర్రాఘవరావు

పెద్దాపురం: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కంటే వీర్రాఘవరావు అన్నారు. మండలంలోని వడ్లమూరు గ్రామంలో ఆర్బీకే వద్ద శుక్రవారం ధాన్యాన్ని ఆయన చేతుల మీదుగా కొనుగోలు చేశారు. వీర్రాఘవరావు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను అన్ని విధాలా ఆదుకుంటోందన్నారు. కంటే రామకృష్ణ, అల్లాడి రాజు, గంగాధర్, సురేష్, ప్రసాద్, సన్యాసిరావు, వ్యవసాయ సహాయకులు శ్రీవాణి పాల్గొన్నారు.

ఉత్సాహంగా చెకుముకి టాలెంట్ పరీక్ష

కరప: మండలం గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం చెకుముకి టాలెంట్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో జూనియర్ విభాగంలో 70 మంది, సీనియర్ విభాగంలో 90 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించేందుకు, గణితం, సైన్స్‌లో అవగాహన కల్పించుకోవడానికి ఈ పరీక్ష ఉపయోగపడుతుందని ఉపాధ్యాయుడు వీవీ రమణమూర్తి తెలిపారు. ఈ పరీక్షలో ఎక్కువ మార్కులు సాధించిన ప్రతీ తరగతి విద్యార్థిని ఎంపికచేసి, ఒక గ్రూపుగా మండల పరిధిలో నిర్వహించే చెకుముకి టాలెంట్ పరీక్షకు పంపిస్తామని హెచ్ఎం ఎ.సాయిమోహన్ తెలిపారు.

నిబంధనలు గాలికి.. ధరలు చుక్కల్లోకి

- పేదోడికి దీపావళి వెలుగులు అరకొరే
- ఆకాశాన్నంటిన బాణసంచా రేట్లు
- పెద్దాపురంలో కానరాని హరిత టపాసులు



పెద్దాపురంలో ముందురోజే సాగుతున్న బాణసంచా విక్రయాలు

పెద్దాపురం: దీపావళి ఈ ఏడాది పేదోడికి అరకొర ఆనందాన్నే మిగులుస్తోంది. అధికార యంత్రాంగం మామూళ్ల మత్తు, బాణసంచా వ్యాపారుల ఆగడాలతో పేదోడి పండగ చీకటిగా మారింది. రెండు రోజులు ఇచ్చిన అనుమతికి అదనంగా మరో రోజు అనధికారిక అనుమతి ఇవ్వడంతో శుక్రవారం ఉదయం నుంచే పెద్దాపురంలో బాణసంచా విక్రయాలను ముమ్మరం చేశారు. పెద్దాపురం పట్టణ పరిధిలో 22, రూరల్ పరిధిలో 8 వెరసి 30 మందికి దుకాణాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు అనుమతులు మంజూరు చేశారు. అనధికారికంగా మరికొన్ని దుకాణాలున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఒక్కో శాఖ.. ఒక్కో రేటు నిర్ణయించి లైసెన్సులు ఇవ్వడం, జీఎస్టీని అదనుగా తీసుకుని బాణసంచా ధరలు విపరీతంగా పెంచి విక్రయిస్తున్నారు. ఇదేమిటని అడిగిన వారికి మాకు లైసెన్సుకే రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు అయింది. ఇక తక్కువ ధరలకు ఎలా విక్రయించేదంటూ వ్యాపారులు వినియోగదారులను ప్రశ్నిస్తున్నారు. అధికారులు అనుమతి ఇచ్చే సమయంలో బాణసంచా ధరలకు సంబంధించి ఎటువంటి ఆదేశాలు ఇవ్వకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా బాణసంచా విక్రయించి సొమ్ములు చేసుకుంటున్నారు. రెండు రోజులే (శని,ఆదివారాలు) విక్రయించాల్సిన బాణసంచాను మరో రోజు (శుక్రవారం) అనధికారంగా పెంచి వ్యాపారాన్ని మూడు పువ్వులు, ఆరు కాయలు అన్న చందంగా చక్కబెట్టేశారు.

ధరలు ఇలా...

చిచ్చుబుడ్డి గత ఏడాది రూ.15 కాగా ఈ ఏడాది 30 రూపాయలకు విక్రయిస్తున్నారు. అగిపెట్టెల బాక్సు రూ.50 రూపాయలుంటే రూ.100కి, సెర్చిలైటు రూ.16 రూపాయలుంటే రూ.25 నుంచి రూ.30 వరకు, కాకర పువ్వొత్తుల బాక్సుల రూ.45 ఉంటే రూ.100కు విక్రయిస్తున్నారు. ఇలా ఒకటి కాదు అన్ని రకాల బాణసంచా సామగ్రి అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

రెండు రోజులకే అనుమతి



మందుగుండు సామాగ్రి విక్రయానికి రెండు రోజుల పాటు అనుమతిలిచ్చాం. ముందు రోజు విక్రయించిన వారిపై తప్పని సరిగ్గా చర్యలు తీసుకుంటాం. పట్టణ, రూరల్ పరిధిలో 30 మందికి తాత్కాలిక మందుగుండు సామగ్రి విక్రయాలకు అనుమతులున్నాయి. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్సు రద్దు చేసి సామగ్రిని సీజ్ చేస్తాం.

–వజ్రపు జితేంద్ర, తహసీల్దార్, పెద్దాపురం

దొరకని హరిత టపాసులు

రెవెన్యూ, అగ్నిమాపక, పోలీస్ అధికారుల తీరుతో వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలు గాలికి వదిలేశారు. హరిత టపాసులు విక్రయించాల్సిన నిబంధన ఎవరూ పట్టించుకోవడం లేదు. జాతీయ పర్యావరణ సంస్థ, ఇంజినీరింగ్ పరిశోధన సంస్థలు సంయుక్తంగా తయారు చేసిన హరిత టపాసులు ఇక్కడ మార్కెట్‌లో దొరకడం లేదు.

కానరాని రక్షణ చర్యలు



వాకతిప్పలో మందుగుండు సామగ్రి విక్రయిస్తున్న షాపు

కొత్తపల్లి: మండలంలో దీపావళి సందడి ప్రారంభమైంది. మందుగుండు సామగ్రి విక్రయాలు చేపట్టే దుకాణాల్లో ఎటువంటి నియమ నిబంధనలు పాటించకుండానే వ్యాపారాలు సాగిస్తున్నారు. సంబంధిత అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం వల్లే దుకాణాలు నిర్వహిస్తున్నారని, ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దుకాణాల వద్ద ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. నిర్వాహకులు మాత్రం ఖాళీ డ్రమ్ములను ఉంచుతున్నారు. అధిక ధరలకు బాణసంచా విక్రయిస్తున్నారని కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో తహసీల్దారు కార్యాలయం సమీపంలో వాకతిప్పలే అవుట్‌లో ఉప్పాడ, కొండెవరం, మూలపేట తదితర గ్రామాల్లో మందుగుండు సామగ్రి దుకాణాలను భారీగా ఏర్పాటుచేశారు.

అంకితభావంతో పనిచేయాలి

సామర్లకోట: ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలని రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో పాయింట్స్ మాన్‌గా పనిచేస్తున్న నోటన్ బిశ్వాస్ కమర్షియల్ క్లర్క్‌గా కృష్ణాజిల్లా చిలకలపూడికి పదోన్నతి వెళతుండడంతో శుక్రవారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్టేషన్ సూపరింటెండెంట్ శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం

పెద్దాపురం: మండలంలోని పులిమేరు శివారులోని కనకదుర్గ గుడి వద్ద శుక్రవారం అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు సింగన చంటియ్య, కంటిపూడి సాయి, కర్రి రాంబాబు, సుందరెడ్డి రాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



పుస్తకాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

సామర్లకోట: వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండల విద్యాశాఖాధికారి వై. శివరామకృష్ణయ్య అన్నారు. శుక్రవారం కరప చెరువు వద్ద ఉన్న మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని ఆయన సూచించారు. విద్యార్థులకు డైరీలను ఇచ్చి వాటిలో రోజు వారీ సిలబస్ తెలియజేయాలన్నారు. ప్రతీ రోజు డైరీలో తల్లిదండ్రుల సంతకాలు ఉండే విధంగా చేయడం వలన పాఠశాలలో ఏమి జరుగుతుందో తల్లిదండ్రులకు తెలుస్తుందని చెప్పారు. జగనన్న గోరుముద్దను ఎంఈఓ రుచి చూశారు. రికార్డులను పరిశీలించి హెచ్ఎం టి.మనోజ్‌ను అభినందించారు.

సంక్షేమం, అభివృద్ధే విజయానికి నాంది

వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో హౌసింగ్ చైర్మన్ దొరబాబు



సంక్షేమం, అభివృద్ధి బోర్డును ఆవిష్కరించిన దొరబాబు



సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల బోర్డులను ఆవిష్కరిస్తున్న నాయకులు

పెద్దాపురం: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జరుపుతున్న సంక్షేమం, అభివృద్ధి పాలనే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి నాంది పలుకుతుందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. పెద్దాపురం పట్టణంలోని 1,2 సచివాలయాల పరిధిలో శుక్రవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఆకుల కృష్ణబాపూజీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో హౌసింగ్ చైర్మన్ దొరబాబు మాట్లాడుతూ ప్రజలకు నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రతీ ఒక్కరూ గుర్తించి రెండవ దఫా వైఎస్సార్ సీపీ విజయానికి నాంది పలకాలని ఆయన కోరారు. రెండవ సారి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజలకు మరింత లబ్ధి చేకూరుతుందని దొరబాబు అన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల కాలంలో రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ప్రజలకు జరిగిన సంక్షేమం, అభివృద్ధిపై వివరించారు. తొలుత పార్టీ జెండా, సంక్షేమం, అభివృద్ధి బోర్డును దొరబాబు ఆవిష్కరించారు. మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, కౌన్సిలర్లు త్సలికి సత్య భాస్కర్, విడదాసరి రాజా, పార్టీ పట్టణ అధ్యక్షుడు కాపుగంటి కామేశ్వరరావు, గృహ సారథుల పట్టణ కన్వీనర్ చింతా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సామర్లకోటలో...

సామర్లకోట: సంక్షేమాభివృద్ధి పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరిగిందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్‌లో భాగంగా సామర్లకోట అల్లంవారి వీధిలోని సచివాలయంలో 15,16 వార్డుల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దొరబాబు మాట్లాడుతూ సంక్షేమంతోనే అభివృద్ధి అని నిరూపించిన గొప్ప నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. అటువంటి వ్యక్తి జీవితం కాలం సీఎంగా ఉండాలని ఇంటింటా ప్రజలకు వివరించారు. వ్యవసాయాన్ని పండగగా మార్చి రైతును రాజుగా చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రిగా చరిత్ర సృష్టించారని తెలిపారు. నవరత్నాలను ప్రకటించి వాటిని అమలు చేయడం జరిగిందన్నారు. ఈ నవరత్నాలలో అత్యంత ముఖ్యమైన అందరికి ఇళ్ల పథకంలో హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా తనకు రెండు పర్యాయాలు పదవి దక్కడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో 175 స్థానాలలోను విజయఢంకా మోగించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు మంచి చేసిన జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని, ఎన్నికల హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సచివాలయం పరిధిలో లబ్ధిదారుల జాబితా బోర్డును దొరబాబు ఆవిష్కరించి, పార్టీ జెండా ఎగురవేశారు. వలంటీర్లకు కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆవాల రాజేశ్వరీ, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్‌చైర్‌పర్సన్లు ఊబా జాన్‌మోజెస్, గొకిన సునేత్రా దేవి, కౌన్సిలర్లు ఆవాల లక్ష్మీ నారాయణ, పిట్టా సత్యనారాయణ, స్వయంభూరపు వీరభద్రరావు, రెడ్నం సునీత, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, జేసీఎ పట్టణ కన్వీనర్ ఇరుసుమల్ల సాయి, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ వారా సుధాకర్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే జగనన్నను గెలిపిస్తాయి

కొత్తపల్లి: రాష్ట్రంలో జగనన్న చేపట్టిన సంక్షేమ పథకాలే వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపిస్తాయని మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ అన్నారు. మండలంలోని గోర్సలో శుక్రవారం రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రి జగనే ఎందుకు కావాలనే కార్యక్రమాన్ని నిర్వహించారు. గృహ సారథులకు, సచివాలయ కన్వీనర్లకు పార్టీ సమకూర్చిన కిట్లను పంపిణీ చేశారు. సచివాలయంలో అభివృద్ధి, సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. గోర్స సెంటర్లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ జెండాలను పంపిణీ చేశారు. అనంతరం రాత్రి పల్లెనిద్ర చేశారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా ఒక్క రూపాయి అవినీతి జరగకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి మళ్లిస్తున్నారని, అందుకే దేశంలోనే ఉత్తమ ముఖ్యమంత్రిగా నిలుస్తారన్నారు. రానున్న ఎన్నికల్లో సీయం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించి అవినీతిని ప్రోత్సహించే పార్టీలను రాష్ట్రంనుంచి తరిమివేయడం ఖాయమన్నారు. మండల సచివాలయ కన్వీనర్ ఉమ్మిడి జాన్ మాట్లాడుతూ గ్రామాల్లో సంక్షేమం, అభివృద్ధి జరుగుతున్నాయన్నారు. కులాలు, మతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి రొంగల వీరబాబు, ఎంపీటీసీ కొండపల్లి సూర్య నాగేశ్వరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పూజ్యం సతీష్ బాబు, రొంగల అప్పారావు, పెదిరెడ్ల కాశీ, సచివాలయ కన్వీనర్లు మద్దాల ఏసుబాబు, వాసంశెట్టి ఆదినారాయణ, రొంగల మంగాదేవి, సచివాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఈఓపీఆర్డీ భాస్కర రావు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీదేవి, గ్రామ రెవెన్యూ అధికారి జగదీష్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాధవపట్నంలో..

సామర్లకోట: మండల పరిధిలో మాధవపట్నం గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని శుక్రవారం ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు ప్రారంభించారు. గ్రామంలోని రెండవ సచివాలయం పరిధిలో లబ్ధిదారుల జాబితా బోర్డును సత్తిబాబు ఆవిష్కరించారు. నాలుగున్నర సంవత్సరాల్లో రాష్ట్రంలో అమలు జరిగిన సంక్షేమ పథకాలను సత్తిబాబు వివరించారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యే విధంగా పెద్దాపురంలో దవులూరి దొరబాబును ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, గ్రామ సర్పంచ్ మేడిశెట్టి సుగుణమ్మ, సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, మండల జేసీఎ కన్వీనర్ ఉటా వాసు, ఎంపీటీసీ సభ్యుడు గుత్తుల కృష్ణార్జున రావు, పార్టీ నాయకులు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.



మాధవపట్నంలో లబ్ధిదారుల జాబితా బోర్డును ఆవిష్కరించిన ఎంపీపీ

లైసెన్సు లేకుండా ఆటోలు నడిపితే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

పిఠాపురం: ఎందరో ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చే ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలని సీఐ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కళ్యాణ మండపంలో ఆటో డ్రైవర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు పలు సూచనలిచ్చారు. పట్టణం ఆధ్యాత్మిక కేంద్రంగా పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతమని ఆయన అన్నారు. అందువల్ల దేశ, విదేశాల నుంచి భక్తులు పిఠాపురానికి నిత్యం వస్తుంటారని ఆయన తెలిపారు. యాత్రికులకు పర్యాటకులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సేవలందించాలన్నారు. ఆటో డ్రైవర్లు మద్యం తాగి ఆటో నడపరాదని ఎక్కువ మంది ప్రయాణికులను ఎక్కించుకున్నా, అధిక చార్జీలు వసూలు చేసినా కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. లైసెన్సు లేని డ్రైవర్లు ఎవరైనా ఉంటే పేర్లు నమోదు చేసుకుంటే రవాణా శాఖ అధికారులతో మాట్లాడి లైసెన్సులు ఇచ్చే ఏర్పాటు చేస్తామన్నారు. పట్టణంలో ఉన్న 15 ఆటో సంఘాల్లో ఉన్న సభ్యులందరూ నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ల సమస్యలు అడిగి తెలుసుకున్న ఆయన వాటి పరిష్కారంకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం ఏఎస్సై సత్యనారాయణ పలువురు ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపలో అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- చిన జగ్గంపేటలో అభివృద్ధి పనుల ప్రారంభం



గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: గ్రామాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. గొల్లప్రోలు మండలం చిన జగ్గంపేటలో శుక్రవారం ఆయన అధికారులు ప్రజాప్రతినిధులతో కలసి గ్రామంలో పర్యటించి లబ్ధిదారులకు వారు పొందిన పథకాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకే నేరుగా సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పథకాల పంపిణీకి ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు నేరుగా ప్రజల వద్దకు వెళ్లి వారికి అందుతున్న పథకాలు అడిగి తెలుసుకుని ఇంకా ఏం కావాలో అడిగి వెంటనే వాటిని సమకూర్చడానికి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో మానమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో పాల్గొని సుమారు కోటికి పైగా నిధులతో నిర్మించిన, నిర్మించనున్న పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ నూతన భవనాన్ని, రూ 42.76 లక్షల జల్ జీవన్ మిషన్ నిధులతో నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను ఆయన ప్రారంభించారు. రూ.13 లక్షల జల్ జీవన్ మిషన్ నిధులతో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పనులకు, రూ.52 లక్షల జల జీవన్ మిషన్ నిధులతో నిర్మించనున్న వాటర్ ట్యాంక్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. జెడ్పీటీసీ వులవకాయల నాగ లోవరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అరిగెల రామయ్యదొర, గ్రామ సర్పంచ్ వమ్మి వీరలక్ష్మి, వమ్మి మల్లికార్జునరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

హోరాహోరీగా టెన్నిస్ పోటీలు



సాధన చేస్తున్న క్రీడాకారులు

పిఠాపురం: స్థానిక ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం నుంచి ప్రారంభమైన రాష్ట్ర స్థాయి టెన్నిస్ పోటీలు శుక్రవారం హోరాహోరీగా జరిగాయి. వివిధ జిల్లాల నుంచి హాజరైన క్రీడాకారులు విజయం కోసం తలపడుతున్నారు. రెండో రోజు అండర్–14 బాలుర విభాగంలో గుంటూరు జట్టు విన్నర్‌గా విజయనగరం జట్టు రన్నర్‌గా నిలిచారు. అండర్–17 బాలుర విభాగంలో గుంటూరు జట్టు విన్నర్‌గా నెల్లూరు జట్టు రన్నర్‌గా నిలిచారు. అండర్–17 బాలికల విభాగంలో గుంటూరు కడప జట్లు ఫైనల్స్‌కు చేరాయి. అండర్–19 బాలుర విభాగంలో గుంటూరు అనంతపురం జట్లు ఫైనల్స్‌కు చేరాయి.

హిందూ ధర్మ రక్షణే జీవిత లక్ష్యం

దివ్యానంద సరస్వతి స్వామీజీ



సమావేశంలో మాట్లాడుతున్న దివ్యానంద సరస్వతి స్వామీజీ

పిఠాపురం: ప్రతి హిందువు హిందు ధర్మ రక్షణే జీవిత లక్ష్యంగా పెట్టుకుని భారతీయ సంస్కృతి సంప్రదాయాలను రక్షించుకోవాలని దివ్యానంద సరస్వతి స్వామీజీ పిలుపు నిచ్చారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు హరేరామ రామాలయంలో శుక్రవారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గొల్లప్రోలు మండల హిందు సమ్మేళనంలో పాల్గొన్న ఆయన ప్రసంగించారు. మన దేశం పేరు భారతదేశం అని ఇండియా కాదని బ్రిటీష్ వారు పెట్టిన పేరు మనకొద్దన్నారు. గోదావరి విభాగ వ్యవస్థాపక ప్రముఖ్ పెమ్మిరాజు రామచంద్రరావు జిల్లా సహ కంబాల నారాయణ రావు, జిల్లా ప్రచారక్ పడాల రఘు, మండల కన్వీనర్ దేవర అచ్చారావు, మహిళా కన్వీనర్ తేటకాయల వరలక్ష్మి, పెద్దాపురం ఖండ ధర్మప్రచారక్ బడంకాయల పేర్రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో శోభాయాత్ర నిర్వహించగా పలువురు ఘనంగా స్వాగతం పలికారు.

పాఠశాల మధ్యలో పిల్లలను పంపకండి



మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఎంఈఓ తదితరులు

సామర్లకోట: పాఠశాలలకు వచ్చిన విద్యార్థులను మధ్యలో ఎవరితోనూ పంపవద్దని ఎంఈఓ–2 పి.పుల్లయ్య అన్నారు. శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలను ఆయన పరిశీలించారు. పాఠశాల నుంచి దుర్గనాని అనే విద్యార్థిని కిడ్నాప్ చేసి ఒక ఆగంతకుడు తీసుకువెళ్లడంతో మండల విద్యాశాఖాధికారులు ఉపాధ్యాయులను అప్రమత్తం చేశాడు. ఆగంతకుడు గత మూడు రోజులుగా దుర్గనానిని మచ్చిక చేసుకొని ప్రతీ రోజు ఐస్ క్రీమ్‌లు, చాక్లెట్లు కొనుగోలు చేసి ఇచ్చేవాడు. ఈ క్రమంలో తనను అంకుల్ అని పిలు అని చెప్పాడు. దీనిలో భాగంగా గురువారం పాఠశాలకు ఆగంతకుడు వచ్చి బాలుని బంధువుగా ఉపాధ్యాయులకు చెప్పి తీసుకొని పోయి కిడ్నాప్ చేసిన విషయం విదితమే. విద్యార్థుల బంధువులు పాఠశాలకు వచ్చి తప్పని సరి పరిస్థితులలో విద్యార్థులను తీసుకువెళ్లవలసిన పరిస్థితి వస్తే.. వారి ఫొటో తీసుకొని జాగ్రత్త పెట్టుకోవాలని సూచించారు. మానవహక్కుల సంఘ నాయకులు నూతలపాటి అప్పలకొండ, ఎస్.రెహమాన్, కుంచే నాని బాబులు పాల్గొన్ని కిడ్నాప్ ఘటనపై వివరాలు సేకరించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని వారు రుచి చూశారు.

చదువుతో పాటు విజ్ఞానాన్ని పెంచుకోవాలి

బాలాజీచెరువు: చదువుతో పాటు విజ్ఞానం పెంపొందించుకోవాలని ఎంఎల్‌సీ కర్రి పద్మశ్రీ పేర్కొన్నారు. ఎంఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలు శుక్రవారంతో ముగిసాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉండే ప్రతిభను వెలికితీయడానికి ఇటువంటి ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఏడు ప్రాజెక్టుల విద్యార్థులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ అమరేశ్వరరావు, బాలల సైన్స్ కో–ఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి ఎంపికైన పాఠశాలలు..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఏలేశ్వరం, మదర్ థెరిస్సా ఉన్నత పాఠశాల కాకినాడ, శ్రీప్రకాష్ పెద్దాపురం, బదిరుల ఉన్నత పాఠశాల కాకినాడ, జెడ్పీ పాఠశాల కరప, చెందుర్తి ఎంపీయూపీ స్కూల్, జిల్లా పరిషత్ ఉందూరు పాఠశాల.

ఎల్లుండి స్పందన రద్దు

కాకినాడ సిటీ: ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయిలో ఈనెల 13న కలెక్టరేట్‌లో జరగాల్సిన జగనన్నకు చెబుదాం–స్పందన రద్దు చేసినట్టు కలెక్టర్ కృతికా శుక్లా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీపావళి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు ప్రకటనలో పేర్కొన్నారు.